www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -52 శనివారం 6 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**

**ముంబై, జూన్ 5.(ప్రజావినికిడి):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత,**మిగతా 2లో...**



## దేశంలో కొందరు నిరాశావాదులు

**అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు**

**సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు**




**న్యూఢిల్లీ, జూన్ 5.(ప్రజావినికిడి):** దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడలు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు.**మిగతా 2లో...**



## వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అరెస్ట్

**గండిపేట భూ కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**నకిలీ జీవోలతో ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నించినట్లు ఆరోపణలు**

**పరారీలో ఉండగా తమిళనాడులోని కాంచీపురంలో పట్టుబడ్డ బ్రహ్మానాయుడు**

**హైదరాబాద్ జూన్ 5.(ప్రజావినికిడి):** హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగుచూసిన వేల కోట్ల రూపాయల భూ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. **2లో...**

# పాలనపై చర్చిద్దామా

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి**

**ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం**

**ఎంపిగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు**

**మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా**

**నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి మా లక్ష్యం**

**జడ్చర్ల సభలో కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్**



**జడ్చర్ల, జూన్ 5(ప్రజావినికిడి):** నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు

## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్

**అధికారికంగా ఖరారు చేసిన పవన్ కల్యాణ్**

**శనివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేయనున్న రమేష్**

**కష్టకాలంలో నిలిచినందుకే పదవి అన్న జనసేన**

**2015 నుంచి పవన్ వెన్నంటి ఉన్న లింగమనేని రమేష్**



**అమరావతి జూన్ 5(ప్రజావినికిడి):** జనసేన పార్టీకి కేటాయించిన రాజ్యసభ స్థానానికి అభ్యర్థిగా పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరును పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేష్ శనివారం **మిగతా 2లో...**

## జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ

**డీఎస్సీ నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్ పై ప్రభుత్వ సమగ్ర వివరణ**

**సుప్రీంకోర్టు ఆదేశాల అమలు అని వెల్లడి**

**అమరావతిజూన్ 5(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై అభ్యర్థులు, మీడియా, సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న సందేహాలు, ఆరోపణలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, శాప్ ఎండీ భరణి తదితర ఉన్నతాధికారులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి నియామకం నిబంధనల మేరకే జరిగిందని, ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావులేదని తేల్చిచెప్పారు. ముఖ్యంగా, హారిజాంటల్ రిజర్వేషన్ విధానంపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ అపోహలు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. **2లో...**





## జల హక్కులను కాపాడాలి

**కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణది కనిష్ట స్థాయి**

**లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు (24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి**

**తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలి :**

**సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ**



## బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

**నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం**

**బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు**

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**మహబూబాబాద్,జూన్ 5(ప్రజావినికిడి):** తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు,**మిగతా 2లో...**



## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు

**ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం**

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్ జూన్ 5(ప్రజావినికిడి):** పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ (ఎల్ఐజీ), మధ్యతరగతి వర్గాలకు (ఎంఐజీ) లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.**మిగతా 2లో...**



# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

మొదటిపేజీ తరువాయి

పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.

ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో

కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు.

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

# జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రెండు రకాల రిజర్వేషన్లు అమలవుతాయని అధికారులు వివరించారు. అవి వర్టికల్ (నిలువు) మరియు హారిజాంటల్ (అడ్డం) రిజర్వేషన్లు.

వర్టికల్ రిజర్వేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి సామాజిక వర్గాలకు కల్పించే రిజర్వేషన్‌ను వర్టికల్ రిజర్వేషన్ అంటారు. దీనికోసం 100 పాయింట్ల రోస్టర్ విధానం అమల్లో ఉంటుంది. ఇందులో ప్రతి కేటగిరీకి నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు కేటాయించి ఉంటాయి. ఈ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో కూడా పోటీ పడవచ్చు. దీనివల్ల కొన్నిసార్లు ఆయా వర్గాలకు నిర్దేశించిన శాతం కంటే ఎక్కువ మంది ఎంపికయ్యే అవకాశం ఉంటుంది.

హారిజాంటల్ రిజర్వేషన్: మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారులు వంటి ప్రత్యేక కేటగిరీలకు కల్పించేది హారిజాంటల్ రిజర్వేషన్. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం, ఈ కేటగిరీలకు నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు ఉండవు. మొత్తం నియామకాల్లో నిర్దేశిత శాతం (ఉదాహరణకు మహిళలకు 33.3%) ఉండేలా చూడటమే దీని ఉద్దేశం.

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఈ విధానాన్ని ఒక బస్సు ఉదాహరణతో సులభంగా వివరించారు. "ఒక బస్సులో 100 మంది ప్రయాణికులను ఎక్కించాలనుకుంటే, అందులో 33 మంది మహిళలు తప్పనిసరిగా ఉండాలి. లైన్‌లో ఉన్నవారిని వరుసగా ఎక్కిస్తున్నప్పుడు, మొదటి 66 మందిలోనే 33 మంది మహిళలు ఉంటే, మిగతా సీట్లను లైన్ ప్రకారం భర్తీ చేస్తాం. ఒకవేళ అలా జరగకపోతే, 66 మంది తర్వాత లైన్‌ను ఆపి, చివర్లో ఉన్న మహిళలను ముందుకు పిలిచి బస్సు ఎక్కిస్తాం. అప్పుడు లైన్‌లో ముందున్న పురుషులు అన్యాయం జరిగిందంటే కుదరదు. ఎందుకంటే రిజర్వేషన్ విధానం అదే" అని ఆయన స్పష్టం చేశారు.

**జీవో 77 అమలు, సుప్రీంకోర్టు ఆదేశాలు**

గతంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా హారిజాంటల్ రిజర్వేషన్ కేటగిరీలకు వర్టికల్ విధానంలోనే రోస్టర్ పాయింట్లు కేటాయించేవారని, అయితే సుప్రీంకోర్టు పలు తీర్పులలో (అనిల్ గుప్తా కేసు, రాజేష్ కుమార్ దరియా కేసు) ఈ విధానం సరికాదని స్పష్టం చేసిందని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర నిబంధనలను మార్చేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు 2023 ఆగస్టు 2న జీవో 77 జారీ చేయబడింది. ఈ జీవో ప్రకారమే మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారుల కోటాను హారిజాంటల్ విధానంలో భర్తీ చేశారు. డీఎస్సీ-2024 ఈ జీవో తర్వాత జరిగిన మొదటి పెద్ద నియామక ప్రక్రియ కావడంతో, అభ్యర్థుల్లో గందరగోళం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు.

**అభ్యర్థుల ఆరోపణలు - అధికారుల వివరణ**

గత కొద్దిరోజులుగా మీడియా, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సుమారు 26 కేసులను అధికారులు ఉదాహరణలుగా తీసుకుని వివరణ ఇచ్చారు.

కాల్ లెటర్ వచ్చినా ఉద్యోగం రాలేదు: కాల్ లెటర్ కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసమేనని, అది ఉద్యోగ నియామకానికి హామీ కాదని ప్రతి కాల్ లెటర్‌లో స్పష్టంగా పేర్కొన్నామని తెలిపారు. 1:1 పద్ధతిలో వెరిఫికేషన్‌కు పిలిచినప్పుడు, కొన్ని ప్రత్యేక కేటగిరీలలో (ఉదా: దివ్యాంగులు) అర్హులైన అభ్యర్థులు చివరి నిమిషంలో అందుబాటులోకి వస్తే, మెరిట్ జాబితాలో మార్పులు జరగడం సహజమని, దానివల్ల మొదట పిలిచిన వారికి అవకాశం కోల్పోయే పరిస్థితి రావచ్చని వివరించారు.

తక్కువ ర్యాంకు వారికి ఉద్యోగం: ఇది పూర్తిగా హారిజాంటల్ రిజర్వేషన్ అమలు వల్లే జరిగిందని స్పష్టం చేశారు. ఒక కేటగిరీలో (ఉదా: బీసీ-ఏ) మహిళా అభ్యర్థులు నిర్దేశిత సంఖ్యలో లేనప్పుడు, మెరిట్ జాబితాలో చివరన ఉన్న పురుష అభ్యర్థిని తొలగించి, ఆ కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థికి (ర్యాంకుతో సంబంధం లేకుండా) అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

స్పోర్ట్స్ కోటా వివాదాలు: స్పోర్ట్స్ కోటా ఎంపిక ప్రక్రియను శాప్ ఎండీ వివరించారు.

సర్టిఫికెట్ల ప్రామాణికత: క్రీడా సర్టిఫికెట్లను ప్రభుత్వం కాకుండా, సంబంధిత క్రీడా సంఘాలు, సమాఖ్యలు జారీ చేస్తాయని, వాటి ప్రామాణికతను నిర్ధారించుకున్న తర్వాతే పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు.

ఆన్‌లైన్ దరఖాస్తే అంతిమం: అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఏ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారో వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినా, ఆన్‌లైన్‌లో ఆ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయని ఒక అభ్యర్థి కేసును ఉదాహరణగా చూపారు.ప్రాధాన్యతా క్రమం: జీవో 4 ప్రకారం ఒలింపిక్స్ నుంచి రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ వరకు ప్రాధాన్యత ఉంటుందని, ఆ క్రమంలోనే ఎంపికలు జరిగాయని వివరించారు. టీమ్ ఈవెంట్ల కంటే వ్యక్తిగత ఈవెంట్లకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

# పాలనపై చర్చిద్దామా

.మొదటిపేజీ తరువాయి

పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పీటీసీగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్



వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పీటీసి ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్దాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు. పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే..

పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కేసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నాం.మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా.జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం.ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు.15 లక్షల రేషన్ కార్డులు అందించాం.4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కేసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్

మొదటిపేజీ తరువాయి

మధ్యాహ్నం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు.

రమేష్ 2015 నుంచి పవన్ కల్యాణ్‌తో, జనసేన పార్టీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సామాజిక వర్గాల మధ్య సఖ్యత, సోషల్ ఇంజినీరింగ్ అవసరమనే పవన్ ఆలోచనా విధానానికి ఆకర్షితులై ఆయనకు వెన్నుదన్నుగా నిలిచినట్లు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

2019 ఎన్నికల్లో పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ, రమేష్ పార్టీ సిద్ధాంతాలపై, పవన్ కల్యాణ్ నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో నిలిచారని జనసేన తెలిపింది. ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా పార్టీకి అండగా నిలిచిన వారికి కుల, మతాలు పరిగణనలోకి తీసుకోకుండా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే సూత్రం ప్రకారమే ఈ ఎంపిక జరిగినట్లు స్పష్టం చేసింది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకే ఆయనకు ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయనను తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.గండిపేట, నార్సింగి ప్రాంతాల్లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించి నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) సృష్టించి, వాటి ద్వారా అక్రమంగా విక్రయించేందుకు బ్రహ్మనాయుడు, మరికొందరు ప్రయత్నించినట్లు ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ భారీ భూ కుంభకోణం విలువ రూ.1,500 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈ కుంభకోణంలో బ్రహ్మనాయుడి పాత్రపై దృష్టి సారించారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ఆయన కోసం గాలింపు చేపట్టి, చివరకు కాంచీపురంలో పట్టుకున్నారు. ఆయన్ను హైదరాబాద్‌కు తరలించి విచారించనున్నట్లు సమాచారం.

## దేశంలో కొందరు నిరాశావాదులు

మొదటిపేజీ తరువాయి

'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు


మొదటిపేజీ తరువాయి

కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు, మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే పరరిపాలనపరమైన అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించిందని మంత్రి విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని తప్పుపట్టారు.రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదని వివరించారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని చెప్పారు. ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని స్పష్టం చేశారు. ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇండ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్టు మంత్రి తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలనీ, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# జల హక్కులను కాపాడాలి

### కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణది కనిష్ట స్థాయి
### లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు (24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి
### తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలి :
### సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్ జూన్ 5(ప్రజావినికిడి):**



కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో ఈ ఏడాది ఏప్రిల్ ఏడున లేఖ రూపంలో బీఆర్ఎస్ చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. అందువల్లే పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందిందని విమర్శించారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని పేర్కొన్నారు. కృష్ణా జలాల వినియోగంలో చారిత్రక కనిష్ట స్థాయికి తెలంగాణ దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ 74.90 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25.10 శాతానికి పరిమితం అయ్యిందని వివరించారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడేసిందని తెలిపారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు అని పేర్కొన్నారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల పూర్తి వినియోగం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి తదితర రంగాలకు తగిన నీటి లభ్యతను నిర్ధారించాలని కోరారు.

## ఫరూఖ్ నగర్ మండలం దుసకల్ గ్రామ 6వ వార్డు మెంబర్

# లింగారం మహేష్ కొత్త రేషన్ కార్డుల పంపిణీ..







**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఇచ్చిన మాట ప్రకారం పని చేసి నిరూపించుకున్న.6వ వార్డు మెంబర్,లింగారం మహేష్ లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. లబ్ధిదారులకు రేషన్ కార్డులేనివారికి ముందు ఉండి కొత్త రేషన్ కార్డులు చేయించి అందచేశారు.ఈ కార్యక్రమాన్ని లింగారం మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా లింగారం మహేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.రేషన్ కార్డు ద్వారా ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు సకాలంలో అందుతాయని అన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు స్థానిక నాయకులు, , యువకులు అదేవిదంగా మహిళలు,గ్రామ ప్రజలు తదితరులు ప్రభుత్వానికి అలాగే లింగారం మహేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం..

## ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి సైకిల్ పై అవగాహన సదస్సు..




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజల్లో అవగాహన పెంచడం కోసం శుక్రవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దిల్ సుఖ్ నగర్ నుంచి కొత్తపేట వరకు పలువురు భారస నాయకులచే కలిసి సైకిల్ మీద ప్రయాణిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని,ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.పెరుగుతున్న కాలుష్యం,వాతావరణ మార్పులు ప్రకృతి వనరుల క్షీణత మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యవసరమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు,కాలనీలు,విద్యాసంస్థలు కార్యాలయాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించగలుగుతాం.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి,నీటి వనరులను సంరక్షించి,చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి.అని అన్నారు.పర్యావరణ పరిరక్షణకు అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం,ప్రకృతి సంరక్షణకు చర్యలు చేపట్టడం దీని ప్రధాన ఉద్దేశ్యం.వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడంచెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం

ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం వల్ల జీవ వైవిధ్యాన్ని కాపాడడంనీరు,గాలి,నేల కాలుష్యాన్ని నివారించడం

పర్యావరణ పరిరక్షణ కోసం మనం చేయాల్సినవి

మొక్కలు నాటడం సంరక్షించడంప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంనీటిని వృథా చేయకుండా ఆదా చేయడం సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా లేదా సైకిల్ వినియోగించడంచెత్తను వేర్వేరుగా సేకరించి రీసైక్లింగ్ చేయడం.పర్యావరణాన్ని కాపాడుదాం భవిష్యత్తును రక్షిద్దాం అని తెలిపారు.ఒక్క మొక్క ఎన్నో ప్రాణాలకు ఆధారం.ప్రకృతి మన సంపద, పరిరక్షణ మన బాధ్యత.పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.ప్రకృతి ఉంటేనే మన భవిష్యత్తు సురక్షితం అని అన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి,సత్యంచారి,గండి సన్నీ యాదవ్,రవిముదిరాజ్,గండికోట శ్రీనాథ్,ముద్ద కళ్యాణ్,ప్రదీప,సదానంద్ రెడ్డి,రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలి.






## కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డితో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఎస్ఐఅర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) వివరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. హేతుబద్ధీకరించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురించనున్నట్లు తెలిపారు.జూలై 31నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి, సెప్టెంబర్ 28లోపు వాటిని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.ఒక వ్యక్తికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని,ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు తుది జాబితాలో ఉండకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరునామా మార్పులు, వివరాల సవరణలు,కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 1,2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత ఇంటింటి గణన సందర్భంగా ఫారం-6 అలాగే డిక్లరేషన్ ఫారం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.ఓటర్లు వివరాల పరిశీలన, ఫారాల పూరణకు టోల్ ఫ్రీ నంబర్ 1950,ఓటర్ పోర్టల్ మరియు ఈసీఐనెట్ (ECINET) యాప్ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి బూత్ స్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో ఆర్డీఓలు సరిత, జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం..

## ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్..




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కలిసి మెట్రో రైల్లో ప్రయాణించారు. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి,కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త మధు సాగర్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పుప్పాలగూడలో ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

## అన్యాక్రాంతం కాకుండా కాపాడిన హైడ్రా




**హైదరాబాద్,జూన్ 5.(ప్రజావినికిడి):** హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. రూ.30వేల కోట్ల విలువైన భూమిని కాపాడినట్లు హైడ్రా తెలిపింది.పుప్పాలగూడ భూముల్లో చారిత్రక రాతి గుట్టలు ఉన్నాయి. ఈ భూములను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. గతంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని రక్షించాలని ఉన్నత న్యాయస్థానం మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం కావడంతో భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు ఇటీవల హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

### ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా

### కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా -సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్



**హైదరాబాద్,జూన్5(ప్రజావినికిడి):** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ రైతాంగానికి వరం కానున్న
# కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో ప్రపంచ స్థాయి మార్కెట్ నిర్మాణం**

**ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కోహెడలో శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గతంలో నిలిచిపోయిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అనుసంధానం, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కోహెడ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.239 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుఅమ్మకాలు, ఎగుమతిదిగుమతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆధునిక గిడ్డంగులు,కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా కేంద్రాలు వంటి





ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మూడు దశల్లో మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని,తొలి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని,రైతు భరోసా,రైతు బీమా,పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృత స్థాయిలో మద్దతు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కోహెడ ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాల అభివృద్ధికి నూతన ఊపునివ్వనుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ రైతాంగానికి, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా నిలవనుందని, సుమారు 239 ఎకరాల్లో,ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకుని నిర్మించనున్న ఈ మార్కెట్ దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు.రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో పాటు, వినియోగదారులు ఒకే చోట నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి మణిహారంగా నిలిచే ఈ మార్కెట్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, మార్కెట్‌లోని ధరలు, లభ్యమయ్యే ఉత్పత్తుల వివరాలు ప్రజలు ఇంటి నుంచే తెలుసుకునే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రైతువినియోగదారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానం కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరుకానుండగా,వారి రవాణా, పార్కింగ్, తాగునీరు,భద్రత, విశ్రాంతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు, సమాచార కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ సంస్థ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి,రాష్ట్ర వ్యవసాయం & సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ శ్రీ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

**పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి**

**కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం**



**హైదరాబాద్,జూన్5(ప్రజావినికిడి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎ÷–లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపా÷–టం÷–మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

**మల్కాజిగిరి చోరీ కేసులో పట్టివేత**



**హైదరాబాద్,జూన్5(ప్రజావినికిడి):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి చోరీ కేసులో నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో నేపాలీ ముఠా భారీ చోరీకి తెగబడింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో నలుగురిని పుణెలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరిని ప్రస్తుతం పుణె నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో రాత్రి సమయంలో చొరబడిన నేపాలీ గ్యాంగ్.. లక్షల రూపాయల విలువైన నగలు, నగదు, ఇతర వస్తువులను అపహరించింది. ఈ చోరీ హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. వెంటనే కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు.. సీసీటీవీ ఫుటేజ్‌లు, సెల్‌ఫోన్ లొకేషన్ డేటా ఆధారంగా గ్యాంగ్‌ను ట్రాక్ చేశారు. నేపాలీ ముఠా దేశంలోని వివిధ నగరాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# థ్రెడ్ పోచంపల్లి
## హైటెక్స్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం






**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్‌హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన "థ్రెడ్ పోచంపల్లి" తెలంగాణ ప్రసిద్ధ ఇకత్ వారసత్వానికి అద్భుత వేదిక

తెలంగాణకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శనను హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్,హాల్-4లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.వ్యవసాయ, మార్కెటింగ్, సహకార,చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రతినిధులు, చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమై సందర్శకులను ఆకట్టుకుంది. ప్రత్యేకంగా రూపొందించిన ప్రవేశ మండపంలో సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ పురస్కార గ్రహీతల చేత రూపొందించిన అద్భుత హస్తకళాఖండాలు, సహజ రంగులు మరియు వాటి తయారీకి ఉపయోగించే పదార్థాల ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఐ ఎక్స్‌పీరియన్స్ బూత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి ఆ అనుభూతిని పొందే అవకాశం కల్పించారు.ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరిస్తూ ప్రత్యేక విజువల్ గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు.

100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు,ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు,గృహ అలంకరణ ఉత్పత్తులు, జీవనశైలి ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. పోచంపల్లి నేయకళ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది.

తెలంగాణ టూరిజం శాఖ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై, పోచంపల్లి గ్రామ సందర్శనకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రచారం చేస్తోంది. వీటి ద్వారా సందర్శకులు నేరుగా నేత కుటుంబాలను కలుసుకుని, సంప్రదాయ మగ్గాల పనితీరును వీక్షించే అవకాశం పొందనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ అలాగే పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను సందర్శించి, అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వేలాది నేత కుటుంబాలకు మద్దతు అందించాలని కోరారు.పోచంపల్లి ప్రాంతీయ వంటకాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లు సందర్శకులకు సాంస్కృతిక అనుభూతిని కలిగిస్తున్నాయి.

యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన జూన్ 7,2026 వరకు కొనసాగనుంది. తెలంగాణ చేనేత వైభవాన్ని తెలుసుకోవడానికి, అనుభవించడానికి మరియు ప్రోత్సహించడానికి ఇది అరుదైన అవకాశంగా నిలవనుంది.

## కామారెడ్డి జిల్లాలో విషాదం.. నదిలో దిగి ముగ్గురి మృతి

**మృతులు అనిత (40), పావని (14), శివాని (13)గా గుర్తింపు**

**ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా కాపాడిన స్థానికులు**

**ఎల్లమ్మ గుడికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లగా ఘటన**

**కామారెడ్డిజూన్ 5(ప్రజావినికిడి):**
కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బాన్సువాడ మండల పరిధిలో శుక్రవారం జరిగింది.వివరాల్లోకి వెళితే.. పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బాన్సువాడ మండలం బుడిమి సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు. దర్శనం అనంతరం దగ్గరలోని మంజీరా నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగారు. అయితే, నీటి లోతు, ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారు అదుపుతప్పి గల్లంతయ్యారు.వారి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాను ప్రసాద్ అనే వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. కానీ, అప్పటికే అనిత (40), ఆమె కుమార్తెలు పావని (14), శివాని (13) నీట మునిగి మృతి చెందారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. ఒకే కుటుంబంలో తల్లి, ఇద్దరు కుమార్తెలు మరణించడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బే సిటీగా విశాఖ

### విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు

### ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ

### ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు



**విశాఖ జూన్ 05,(ప్రజావినికిడి):** విశాఖ పట్నంను బే సిటీ(తీర ప్రాంత నగరం)గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నతాధికారులకు సూచించారు. విశాఖ పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక నోవాటెల్ హోటల్‌లో విశాఖ ఎకనమిక్ రీజియన్ (విఇఆర్)పై తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బే సిటీగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ ఈ బే సిటీ ప్రాజెక్టు అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా కైలాసగిరిని తీర్చిదిద్దుతామన్నారు. విశాఖలో విఇఆర్ మోనటరింగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేసుకోవాలని, గ్రేహౌండ్స్‌కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ఆకర్షణకు ఇదే మంచి తరుణమని బీచ్ వాటర్ స్పోర్ట్స్‌తో పాటు వినోదం కలిగించే వివిధ ప్రాజెక్టులను చేపడితేనే పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ జూ పార్క్‌ను ఆధునీకరించి పర్యాటకులను ఆకర్షించాలని, విశాఖలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేయాలని, రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు వంటి పర్యాటక ప్రాంతాలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.నగరాల్లో టూరిజం ప్రాజెక్టుల చుట్టూ పారిశ్రామిక టౌన్‌షిప్‌లు అభివృద్ధి కావాల్సి ఉందన్నారు. కేంద్రంలోని నీతి అయోగ్ సమర్పించిన విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (విఇఆర్) ప్రాజెక్టు నివేదికను ప్రజల్లో చర్చకు ఉంచాలని, విద్యార్థులు, మేధావుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలాశ్రీ బాలా వీరాంజనేయ స్వామి, విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, శ్రీకాకుళం నుంచి తూర్పు గోదావరి వరకూ తొమ్మిది జిల్లాల కలెక్టర్‌లు, విఇఆర్ కన్వీనర్లు, పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, రవాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఐటి శాఖ కార్యదర్శి భాస్కర్, విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పాల్గొన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు.

# భూమి కొలతల కోసం లంచం డిమాండ్

### ఎసిబికి చిక్కిన మండల సర్వేయర్

**కరీంనగర్,(ప్రజావినికిడి):** భూమి కొలతల కోసం లంచం తీసుకున్న మండల సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విడతల వారిగా బాధితుడు నుంచి రూ. 25 వేలు తీసుకున్న మండల సర్వేయర్ ఎక్కలదేవి కుమార స్వామితో పాటు, మరో ఇద్దరు ప్రైవేట్ సర్వేయర్లు తీగల రాజేశ్, వంగ విహిత్ రెడ్డిని పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మన్‌గుర్తి గ్రామానికి చెందిన బాధితుడు తన భూమికి సంబంధించిన సర్వే చేయాలని సంప్రదించగా గత మే నెల నుంచి మూడు విడతలుగా మండల సర్వేయర్ లంచం తీసుకున్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

# స్పా సెంటర్లలో అసాంఘీక కార్యకలాపాలు

### మల్కాజిగికి ప్రాంతంలో ఏకకాలంలో దాడులు

### 113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు



**హైదరాబాద్,జూన్5(ప్రజావినికిడి):**నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు. స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# కల్తీ పదార్థాలతో చాక్లెట్ల తయారీ



**హైదరాబాద్,జూన్5(ప్రజావినికిడి):**మహానగరంలోని కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టును హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్ రట్టు చేసింది. సీతారాంబాగ్ ప్రాంతంలో విగ్నేట్ ఫుడ్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై హెచ్ ఫాస్ట్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి కార్తీక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసింది. ఈ సంస్థలో రసాయన పదార్థాలతో కల్తీ చా÷-లకెట్లు తయారు చేస్తున్నట్లు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఈ సంస్థపై సదరు టీమ్ దాడి చేసింది.

# ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేళ పవన్ కల్యాణ్ పిలుపు

### మూలపాడులోని బటర్ ఫ్లై పార్కులో తెల్ల పొనికి మొక్కను నాటిన పవన్

### తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ మొక్క నాటిన వైనం

### 2.5 కోట్ల సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం





**అమరావతి జూన్ 5 (ప్రజావినికిడి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక వినూత్నమైన, అర్థవంతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇస్తూనే... ఇటు ఒక భావోద్వేగపూరితమైన వ్యక్తిగత స్ఫూర్తితో ఆయన తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.

ఎన్టీఆర్ జిల్లాలోని మూలపాడు 'బటర్ ఫ్లై పార్క్' (సీతాకోకచిలుకల పార్క్)ను సందర్శించిన పవన్ కళ్యాణ్..

అక్కడ ఎంతో అరుదైన, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన 'తెల్ల పొనికి' మొక్కను నాటారు. ప్రపంచప్రసిద్ధి చెందిన కొండపల్లి బొమ్మల తయారీకి ఈ తెల్ల పొనికి కర్రనే ఉపయోగిస్తారు. ఈ అరుదైన మొక్కను పవన్ కల్యాణ్ తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ నాటడం విశేషం.

ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక బహిరంగ విజ్ఞప్తి చేశారు. "మనకు జన్మనిచ్చిన తల్లిపై ప్రేమతో, గౌరవంతో ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరిట కనీసం ఒక్క మొక్కనైనా నాటాలి. మనమంతా కలిసికట్టుగా పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

**2.5 కోట్ల 'విత్తన బంతుల' భారీ ఉద్యమం!**

రాష్ట్రంలో అడవుల శాతాన్ని, పచ్చదనాన్ని భారీగా పెంచే లక్ష్యంతో పవన్ అత్యంత ప్రతిష్టాత్మకమైన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఒక భారీ టార్గెట్‌ను నిర్దేశించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2.5 కోట్ల విత్తన బంతులను సిద్ధం చేసి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు, బంజరు భూములు, ప్రభుత్వ ఖాళీ స్థలాలలో చల్లడం ద్వారా సహజసిద్ధంగా అడవుల పునరుత్పత్తి జరిగేలా ప్లాన్ చేశారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలన్నా, పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నా ఇలాంటి హరిత కార్యక్రమాలు అత్యంత కీలకమని పవన్ నొక్కి చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ పచ్చని ఉద్యమంలో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు.

# ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే

### జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

### రెండోరోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్,జూన్5(ప్రజావినికిడి):** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు.

అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల

అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు.నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సిఎం వెంట మంత్రలుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

## 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730

**న్యూఢిల్లీ,జూన్ 5(ప్రజావినికిడి):** భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కోత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది. ఇక నగరంలో కిలో వెండి ధరలో రూ.5 వేల మేర కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.8 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.350ల మేర తగ్గింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,960గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల



బంగారం ధర రూ.1,44,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,42,750గా ఉంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,880గా, 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,444 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

# వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

## శాస్త్రోక్తంగ్రా చక్రస్నానం నిర్వహణ



**తిరుపతిజూన్ 5 (ప్రజావినికిడి):** తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

## విజయవాడలో సైకిల్ తొక్కిన హోంమంత్రి

**విజయవాడ,జూన్ 5(ప్రజావినికిడి):**



ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నో వెహికల్ డే సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సహా ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కారు. అలానే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో తన నివాసం నుంచి ఆటోనగర్ ఫైర్ స్టేషన్ వరకు సైకిల్ తొక్కారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజూ ఓ గంట పాటు సైకిల్ తొక్కడం వల్ల ఓవైపు ఆరోగ్యం, మరోవైపు పర్యావరణం బాగుపడతాయని తెలిపారు. ప్రధాని పొదుపు మంత్రంలో భాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశా నిర్దేశర మేరకు ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటిస్తున్నామని ఆమె వెల్లడించారు. 'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రులందరం కాన్వాయ్ వెహికల్‌లను తగ్గించాం. అవకాశం ఉంటే పోలీసులంతా ఒకే వెహికల్లో వెళ్లే యోచన కూడా చేస్తాం. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. అందుకే ప్రజా ప్రతినిధులంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సైకిళ్లు తొక్కుతున్నాం' అని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్, బంగారం లాంటివి కొనుగోలు తగ్గించడం వల్ల విదేశీ మారక నిల్వలు పెరుగుతాయి. డాలర్‌తో రూపాయి విలువ తగ్గుతుంది. ఈ విషయాలను ప్రజలందరూ గమనించి పెట్రోల్, డీజిల్ వాడకాలు తగ్గించాలి. సైకిల్ తొక్కాలి అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# అర్ధరాత్రి ఇంట్లో పేలిని సిలిండర్

## అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి

**నల్లగొండ,జూన్ 5 (ప్రజావినికిడి):**
నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన



ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

# తిరుమలలో మొక్క నాటిని కేంద్రమంత్రి

## శ్రీవారిని దర్శించుకున్న పీయూష్ గోయల్






**తిరుమల,జూన్ 5 (ప్రజావినికిడి)::** ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనం అద్భుతంగా జరిగిందన్నారు. ప్రతి ఏటా జూన్ మాసంలో పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు తన తల్లి పేరిట తిరుమలలో మొక్క నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు నేడు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలు కూడా తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలన్నారు. తిరుమలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అద్భుతంగా ఉందని కేంద్ర మంత్రి కొనియాడారు. దర్శన గణంకాలతో పాటు తిరుమలలో టీటీడీ భక్తులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ఇక్కడి నుంచే పర్యవేక్షించడం అద్భుతమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో అత్యాధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను100 రోజుల్లోనే టీటీడీ ఏర్పాటు చేయడం హర్షణీయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈరోజు(శుక్రవారం) ఉదయం కేంద్ర మంత్రి తిరుమల శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

## ప్రజాప్రతినిధులతో కలసి రామ్మోహన్ సైకిల్ ర్యాలీ

**శ్రీకాకుళంజూన్ 5(ప్రజావినికిడి):**



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికీ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైనది పర్యావరణ మన్నారు. పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ... పర్యావరణ ప్రభావం మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం మీద ఉంటుందన్నారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రధాని మోదీ గత 12 సంవత్సరాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేస్తున్నారని కేంద్ర మంత్రి అన్నారు. ప్రధానిని ఆదర్శంగా తీసుకొని దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కొనసాగుతోందన్నారు. మోదీ చేపట్టిన స్వచ్ఛభారత్‌ను ఆదర్శంగా తీసుకుని సీఎం చంద్రబాబు స్వచ్ఛఆంధ్రా కార్యక్రమం చేపట్టారని చెప్పారు.

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

**జూన్ 5 (ప్రజావినికిడి):**
ఏటా పర్యవారణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యవారణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్దికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత



పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా, పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది.

# జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి రాహుల్




న్యూచండీగఢ్‌లో జరుగుతున్న ఈ చారిత్రాత్మక మొదటి టెస్ట్ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడారు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్టు కలయికపై ఆయన కొన్ని కీలక సంకేతాలు ఇచ్చారు. ఆ సూచనల ఆధారంగా అఫ్గానిస్తాన్‌తో తలపడే భారత్ అంచనా తుది జట్టు ఇలా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారతదేశం తరఫున అత్యుత్తమ స్థానంలో ఉన్న ఈ యువ ఓపెనర్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం ఖాయమైంది. జైస్వాల్‌తో కలిసి రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌కు అతడిని టీమిండియా వైస్ కెప్టెన్‌గా కూడా మేనేజ్‌మెంట్ నియమించింది. ఎడమచేతి వాటం బ్యాటర్ సాయి సుదర్శన్ నంబర్ 3 పొజిషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉందని కోచ్ గంభీర్ హింట్ ఇచ్చారు. ఐపీఎల్ 2026లో 722 పరుగులతో సూపర్ ఫామ్‌లో ఉన్న సుదర్శన్, అదే జోరును టెస్టుల్లోనూ కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు. జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన రెగ్యులర్ స్థానమైన నంబర్ 4లో బ్యాటింగ్‌కు రానున్నాడు. మెడ గాయం కారణంగా గువాహటిలో సౌతాఫ్రికాతో జరిగిన గత టెస్టుకు దూరమైన గిల్.. ఇప్పుడు పూర్తిగా కోలుకుని జట్టులోకి పునరాగమనం చేస్తున్నాడు. వికెట్ కీపర్ బ్యాటర్‌గా పంత్ నంబర్ 5లో బరిలోకి దిగనున్నాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగే ఈ మ్యాచ్ పంత్‌కు కెరీర్‌లో 50వ టెస్ట్ కావడం విశేషం. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకోవడం దాదాపు ఖాయమైంది. బ్యాట్, బాల్ రెండింటితోనూ రాణించాలని ఈ యువ ఆటగాడు చూస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా సుందర్ తుది జట్టులో ఉంటాడు. విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబే.. మానవ్ సుతార్‌ను కాదని న్యూచండీగఢ్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. ఐపీఎల్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పటికీ, కుల్దీప్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. రవీంద్ర జడేజా అందుబాటులో లేకపోవడంతో భారత స్పిన్ విభాగాన్ని అతడే ముందుండి నడిపించనున్నాడు. భారత పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అతడే కావడం గమనార్హం. పంజాబ్ అన్‌క్యాప్డ్ పేసర్ గుర్నూర్ బ్రార్ కంటే ప్రసిద్ధ్ కృష్ణకే తుది జట్టులో ఎక్కువ అవకాశం ఉంది. సిరాజ్‌తో కలిసి అతడు పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు. టీమిండియా తుది జట్టు (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ

# సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడు

## టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్




అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్ట్‌లో సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇప్పటి వరకు అతనికి ఎక్కువ అవకాశాలు రాలేదని చెప్పాడు. అంతేకాకుండా ప్రస్తుతం అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడని గుర్తు చేశాడు. న్యూ చండీగఢ్ వేదికగా శనివారం నుంచి అఫ్గానిస్థాన్, భారత్ మధ్య ఏకైక టెస్ట్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం టీమిండియా సన్నాహకాలను పూర్తి చేసుకుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం గౌతమ్ గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. టీమ్ కాంబినేషన్ గురించి ప్రశ్నించగా.. సాయి సుదర్శన్ నెంబర్ 3లో ఆడుతాడని స్పష్టం చేశాడు. తద్వారా దేవదత్ పడిక్కల్ బెంచ్‌కే పరిమితమవుతాడనే విషయాన్ని వెల్లడించాడు. 'సాయి సుదర్శన్‌కు ఇప్పటి వరకు తగిన అవకాశాలు రాలేదు. అతను ఇంగ్లండ్ పర్యటనలో కూడా ఆడాడు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అతనికి వరుస అవకాశాలు ఇవ్వాలనుకుంటున్నాం. మేం 11 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయగలం. సాయి సుదర్శన్ ఏం చెత్త ఫామ్‌లో లేడు. ఐపీఎల్‌లో 700 పరుగులు చేశాడు. 4-5 మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా సాయి సుదర్శన్‌ను జడ్జ్ చేస్తే.. మేం జట్టును నిర్మించలేం. డబ్ల్యూటీసీ టైటిల్ గెలుస్తామనే నమ్మకం మాకుంది. జట్టులో ప్రతిభకు కొదవలేదు. ఆటగాళ్లంతా డబ్ల్యూటీసీ గెలవాలనే కసితో ఉన్నారు. ఐపీఎల్ ముగిసిన వెంటనే టెస్ట్ మ్యాచ్ జరుగుతుందని సాకులు చెప్పడానికి లేదు. టెస్ట్ మ్యాచ్‌లు అనేవి మెంటల్ టఫ్‌నెస్‌ను పరీక్షిస్తాయి. ఆగస్టులో వెళ్లే శ్రీలంక పర్యటన కోసం నలుగురు స్పిన్నర్లను సిద్ధం చేస్తున్నాం. మానవ్ సుతార్, హర్ష్ దూబే రూపంలో ఇద్దరు యువ స్పిన్నర్లు అందుబాటులో ఉన్నారు. ఈ మ్యాచ్ వారికి మంచి అవకాశం. శ్రీలంక పర్యటన కోసం నాలుగో స్పిన్నర్‌ను పరీక్షిస్తాం. న్యూజిలాండ్ పర్యటన కోసం కాస్త భిన్నంగా సన్నద్ధం కావాల్సి ఉంది. టెస్ట్‌లు ఆడే కొందరిని అఫ్గాన్‌తో వన్డే సిరీస్ నుంచి తప్పిస్తాం. టెస్ట్‌ల కోసం మరింత సన్నద్ధత అవసరమనేది మా భావన. రిషభ్ పంత్ తన ఆటను మార్చుకోవాల్సిన అవసరం లేదు. తన దూకుడు కొనసాగించాలి. కానీ అంతర్జాతీయ ఆటగాళ్లు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాలి.'అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో కూడా టీమిండియా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది.



# రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ ఆడగలడా..?

ఇంగ్లండ్ పేసర్ రాబిన్సన్ నిప్పులు చెరిగాడు. తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో రాబిన్సన్ ఈ ఫీట్ సాధించాడు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఫస్ట్ ఓవర్‌తోనే రాబిన్సన్ ఆకట్టుకున్నాడు. మెయిడిన్ ఓవర్‌తో పాటు మూడు కీలక వికెట్లు తీసాడు. రాబిన్సన్ ప్రదర్శనను చూసిన క్రికెట్ అభిమానులు.. వైభవ్ సూర్యవంశీని తెరపైకి తీసుకొచ్చాడు. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా అనే చర్చకు తెరలేపారు. వర్షం కారణంగా ఈ టెస్ట్ మ్యాచ్‌కు కాసేపు అంతరాయం కలిగింది. ఆ తర్వాత కండిషన్స్ స్వింగ్‌కు అనుకూలించడంతో రాబిన్సన్ చెలరేగాడు. తొలి రెండు బంతులను డాట్ చేసిన అతను.. మూడో బంతిని డేవాన్ కాన్వేను ఔట్ చేశాడు. నాలుగో బంతిని డాట్ చేయగా.. ఐదో బంతికి కేన్ విలియమ్సన్ వెనుదిరిగాడు. ఆరో బంతికి రచిన్ రవీంద్రను పెవిలియన్ చేర్చి న్యూజిలాండ్‌ను కోలుకోలేని దెబ్బతీసాడు.

# వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం!



భారత బ్యాటింగ్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ క్రికెట్ అభిమానులకు గట్టి షాక్ ఇచ్చారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ మొత్తానికి ఆయన దూరమయ్యారు. ఈ విషయాన్ని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ గురువారం (జూన్ 4) వెల్లడించింది. ఇటీవల ఆదివారం (మే 31) జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గుజరాత్ టైటాన్స్‌పై 42 బంతుల్లో 75 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న 37 ఏళ్ల కోహ్లీ.. అదే మ్యాచ్‌లో గాయపడ్డారు. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్‌తో భారత్ ఆడబోతున్న మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో ఆయన భాగం కాలేకపోతున్నారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా కోహ్లీ వన్డే సిరీస్‌కు దూరం కావలసి వచ్చింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లోనే ఆయనకు ఈ గాయమైంది. స్కానింగ్ రిపోర్టులలో ఆయనకు 'డిస్టల్ సెమీమెంబ్రానోసస్ టెండన్ టియర్'అయినట్లు తేలింది" అని బీసీసీఐ వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. ఇది మోకాలి వెనుక భాగం కింద ఉండే హ్యామ్‌స్ట్రింగ్ కండరాలను అనుసంధానించే దట్టమైన నరానికి సంబంధించిన ఒక అరుదైన గాయం. అయితే కోహ్లీ గాయంపై మరియు సిరీస్ నుండి ఆయన తప్పుకోవడంపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ దూరం కావడంతో ఆయన స్థానంలో యశస్వి జైస్వాల్ లేదా రుతురాజ్ గైక్వాడ్‌లను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. న్యూజీలాండ్‌తో జరిగిన గత వన్డే సిరీస్‌లో జైస్వాల్ జట్టులో ఉన్నప్పటికీ ఆడే అవకాశం రాలేదు. మరోవైపు గైక్వాడ్ గత ఏడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో మిడిల్ ఆర్డర్‌లో ఆకట్టుకున్నాడు. అయితే, ప్రస్తుతం గైక్వాడ్ శ్రీలంకలో జరగబోయే త్రైపాక్షిక సిరీస్ కోసం 'ఇండియా ఎ' జట్టులో ఉన్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను మే 19నే ఈ చారిత్రక హోమ్ సిరీస్ కోసం ఎంపిక చేశారు. అయితే ఐపీఎల్ 2026లో హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడిన రోహిత్.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడతాడనే నిబంధనతో జట్టులోకి తీసుకున్నారు. ఆయన ఈ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇంకా చూడాల్సి ఉంది. భారత్-ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్ షెడ్యూల్: మొదటి వన్డే: జూన్ 13 (శనివారం) -- ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం). రెండవ వన్డే: జూన్ 17 (బుధవారం) -- లక్నో (భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం). మూడో వన్డే: జూన్ 20 (శనివారం) -- చెన్నై (చెపాక్)




# శ్రీలంకలో అడుగుపెట్టిన ఇండియా-ఏ టీమ్..

## • భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ మధ్య ట్రై సిరీస్

శ్రీలంక వేదికగా ఓ ట్రై సిరీస్‌ను బీసీసీఐ ప్లాన్ చేసింది. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల 'ఏ' జట్లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. జూన్ 9 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ జూన్ 21 వరకు సాగుతోంది. ఈ సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మీదే ఉంది. ఈ సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక గడ్డపై అడుగుపెట్టాడు. ఐపీఎల్ 2026లో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల వైభవ్.. ఇప్పుడు ఇంటర్నేషనల్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంక వేదికగా జరగనున్న ట్రై సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంక చేరుకుంది. మొత్తం ఏడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాలు పాల్గొంటున్నాయి. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య ట్రై సిరీస్ జరగనుంది. ఈ మూడు దేశాల ఏ కేటగిరి జట్లు ఈ ట్రై సిరీస్‌లో పాల్గొంటున్నాయి. ఈ సిరీస్‌కు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ సిరీస్ రానున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ కోసం యువ ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు ఉపయోగపడనుంది. ఈ సిరీస్‌లో ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇండియా ఏ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుండటం విశేషం. వైస్ కెప్టెన్‌గా ఎంపికైన రియాన్ పరాగ్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దాంతో వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశారు. బీసీసీఐ చెప్పిన ప్రకారం వన్డే ట్రై సిరీస్ మ్యాచ్‌లు దంబుల్లాలో జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన వెంటనే ఇండియా - ఏ, శ్రీలంక - ఏ జట్ల మధ్య రెండు రోజుల రెడ్ బాల్ మ్యాచ్‌లు గాలేలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి భారత జట్టును ఇంకా ప్రకటించలేదు. ట్రై సిరీస్ ఫుల్ షెడ్యూల్‌భారత్ ఏ - శ్రీలంక ఏ జూన్ 9న, భారత్ ఏ - అఫ్ఘనిస్థాన్ ఏ జూన్ 11న, అఫ్ఘనిస్థాన్ ఏ - శ్రీలంక ఏ జూన్ 13న, భారత్ ఏ - శ్రీలంక ఏ జూన్ 15న, భారత్ ఏ - అఫ్ఘనిస్థాన్ ఏ జూన్ 17న, అఫ్ఘనిస్థాన్ ఏ - శ్రీలంక ఏ జూన్ 19న, జూన్ 21 ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇండియా - ఏ స్క్వాడ్‌ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోనీ, నిశాంత్ సింధూ, అనుకుల్ రాయ్, సూర్యాన్ష్ షెడ్జే, విప్‌రాజ్ నిగమ్, రుతురాజ్ గైక్వాడ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, కుమార్ కుశాగ్ర, యశ్ ఠాకూర్, యుద్ధ్‌వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్.

# టీమిండియా కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్





ఇండియా టీ20 క్రికెట్ లో మరో సంచలన మార్పుకు తెర లేవనుంది. టీ20 వరల్డ్ కప్ 2026 టైటిల్ గెలిచిన కొద్ది నెలలకే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తప్పించడానికి బీసీసీఐ సిద్ధమైంది. అప్కమింగ్ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లకు కొత్త కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు తీసుకోనున్నట్లు పలు కథనాల్లో వెల్లడైంది. ఆన్‌లైన్ లో జరగబోయే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ లో ఈ డెసిషన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారు. సూర్య స్థానంలో నాలుగో నంబర్ బ్యాటర్ గా, లీడర్ గా శ్రేయస్ ను నియమించాలనే నిర్ణయం ఆల్రెడీ జరిగిపోయింది. అలాగే అక్షర్ పటేల్ ప్లేస్ లో యంగ్ ప్లేయర్ తిలక్ వర్మను వైస్ కెప్టెన్ గా ప్రమోట్ చేయనున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో సంజూ శాంసన్ ను టీ20 కెప్టెన్ చేయాలని గట్టిగా కోరుకున్నట్లు సమాచారం. అయితే బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దీనికి అంగీకరించలేదు. సెలెక్షన్ కమిటీలోని ఇతర మెంబర్స్ కూడా గంభీర్ ప్రతిపాదనతో విభేదించారు. శాంసన్ కెరీర్ లో కన్సిస్టెన్సీ లేకపోవడమే దీనికి మెయిన్ రీజన్ అని వాళ్లు భావించారు. వరల్డ్ కప్ గెలిపించడంలో సంజూ కీలక పాత్ర పోషించినప్పటికీ, అతడిని లాంగ్ టర్మ్ కెప్టెన్సీ ఆప్షన్ గా సెలెక్టర్లు చూడటం లేదు. అంత పెద్ద రెస్పాన్సిబిలిటీ ఇవ్వడానికి ఇది సరైన టైమ్ కాదని సెలెక్టర్లు స్పష్టం చేశాడు. వరల్డ్ కప్ విన్నింగ్ స్క్వాడ్ లో లేని శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ లో మాత్రం అద్భుతంగా రాణించాడు. ఐపీఎల్ 2025 లో పంజాబ్ కింగ్స్ ను ఫైనల్స్ కు తీసుకెళ్లిన శ్రేయస్, రీసెంట్ గా ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ లో కూడా బ్యాట్ తో మెరిశాడు. పంజాబ్ టీమ్ ప్లే ఆఫ్స్ చేరనప్పటికీ, శ్రేయస్ 14 మ్యాచుల్లో 168.81 స్ట్రైక్ రేట్ తో 498 రన్స్ చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ సాలిడ్ పర్ఫార్మెన్స్ వల్లే అతడికి కెప్టెన్సీ ఛాన్స్ దక్కింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరుసగా రెండు సార్లు ఐపీఎల్ చాంపియన్ గా నిలిపి, బ్యాటింగ్ లో కూడా ఇరగదీసిన రజత్ పాటిదార్ పేరును మాత్రం సెలెక్టర్లు అస్సలు కన్సిడర్ చేయలేదు. లీడర్ షిప్ రేస్ లో అతడికి చోటు కల్పించడంపై ఎలాంటి డిస్కషన్ జరగలేదని సోర్సెస్ ద్వారా తెలిసింది. కేవలం శ్రేయస్ అయ్యర్ ను మెయిన్ లీడర్ గా ప్రాజెక్ట్ చేస్తూ టీమ్ ను ఫ్యూచర్ కోసం బిల్డ్ చేయాలని బోర్డు భావిస్తోంది. త్వరలోనే ఈ లైనప్ పై అఫీషియల్ ప్రెస్ నోట్ రానుంది.

# సుదీర్ఘ కాలం తరవాత వైష్ణవ్ తేజ్ మూవీకి ఓకే



'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బ్జడెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.

------------



## దూత వెబ్ సీరిస్‌కు నిర్మాతగా నాగచైతన్య

'దూత' వెబ్‌సిరీస్‌తో తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ఇప్పుడు ఈ హిట్ సిరీస్‌కు సీక్వెల్ సిద్ధమవుతోంది. శుక్రవారం పూజా కార్యక్రమాలు జరగ్గా.. నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సీక్వెల్‌కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. 'దూత సెకండ్ చాప్టర్‌లో నిర్మాతగా నా తొలి అడుగు' అంటూ నాగచైతన్య ఫొటోలు పంచుకున్నారు. మరోసారి మ్యాజిక్ చూడడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'దూత'.. 2023 డిసెంబరు 1న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఈ హారర్ మిస్టరీ థ్రిల్లర్‌లో జర్నలిస్టు సాగర్ వర్మ అవధూరిగా నాగచైతన్య ఆకట్టుకున్నారు.




## జూలైలో విడుదల కానున్న ది ఇండియా స్టోరీ

భారతదేశంలో జరిగిన కొన్ని నమ్మలేని సంచలన నిజాల ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ అండ్ హార్డ్ హిట్టింగ్ మూవీ 'ది ఇండియా స్టోరీ'. 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలో నటిస్తున్నాడు. సాగర్ బీ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రియులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక టీజర్ చూస్తుంటే.. సమాజంలో దాగి ఉన్న అత్యంత దిగ్భ్రాం÷-రతికరమైన నిజాలను, తెరవెనుక జరిగిన పరిణామాలను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నామని చిత్ర యూనిట్ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక విలక్షణమైన కథాంశంతో, ప్రేక్షకులను ఆలోచింపజేసే సస్పెన్స్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది.

## పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

### సరైన ప్రాధాన్యం లేదంటూ సోషల మీడియా పోస్ట్ జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం



నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ.135 కోట్లు వసూలు చేసింది.

# పెద్ది బాక్సాఫీస్ కలెక్షన్ల సునామి

### తొలిరోజే రూ.135.36 కోట్లు వసూలు -బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల

ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ




ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

## జననాగన్ మూవీ రిలీజ్ వ్యవహారం

### థియేట్రికల్ ఒప్పందాలు రద్దు చేసుకున్నట్లు వార్తలు




ఈ ఏడాది ప్రారంభం నుంచి వార్తల్లో ఉన్న చిత్రం 'జననాయగన్'. తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ చివరి సినిమాగా రూపొందిన 'జననాయగన్' సెన్సార్ కారణంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్, నాన్-థియేట్రికల్ డీల్స్ విషయంలో విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. జనవరి 9నే 'జననాయగన్' థియేటర్లలోకి రావాల్సిఉంది. అయితే, సెన్సార్ పరమైన కొన్ని ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే ఈ సినిమా నాన్-థియేట్రికల్ ఒప్పందాలు రద్దయినట్లు తెలుస్తోంది. దీనితోపాటు ఇప్పటివరకు జరిగిన అన్ని థియేట్రికల్ అగ్రిమెంట్లను కూడా రద్దు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు అడ్వాన్స్ డబ్బులను తిరిగి ఇచ్చేయాలని విజయ్ నిర్మాతలకు సూచించినట్లు సమాచారం. దీంతో నిర్మాణసంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ మీటింగ్ ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. సినిమా విడుదల తేదీ ఖరారైన తర్వాత సొంతంగా రిలీజ్ చేసుకోవాలని విజయ్ సలహా ఇచ్చారట. హెచ్.వినోద్ దర్శకత్వంలో సామాజిక కథాంశంతో రూపొందిన చిత్రం 'జన నాయగన్'. ఈ పొలిటికల్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది. ఇందులో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించారు. మమితా బైజూ, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తెలుగు హిట్ సినిమా 'భగవంత్ కేసరి' ఆధారంగా రూపొందినట్లు గతంలో వార్తలు వచ్చాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613